కదం తొక్కిన బీడీ కార్మికులు
2





2
పాఠశాలలో చేతబడి కలకలం..

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

తెయూలో భగత్ సింగ్ జయంతి



అక్షరటుడే, తెయూ క్యాంపస్: తెలంగాణ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ అధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదుట భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు వినీత్, చక్రి, నాయకులు కృష్ణ, నవీన్, బాలమణి, ఆకాంక్ష తదితరులు పాల్గొన్నారు.

28-9-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2



మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ కార్పొరేటర్లు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : ప్రజా సమస్యలను పరిష్కరించాలని బీజేపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. నగరంలోని 60 డివిజన్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నప్పటి నుంచి డివిజన్లో సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కావట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కార్పొరేటర్లు ఒక్కసారిగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని నిలువరించారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయిస్తామని వారు నినాదాలు చేశారు.



కేవీఆర్ కృషి ఫలించేనా..

- ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే
- నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర మంత్రులకు ప్రతిపాదనలు
- సుమారు రూ.వెయ్యి కోట్లకుపైగా పనులు
- కీలకమైన పనులకు ఆమోదం కోసం ప్రయత్నాలు ముమ్మరం
- కేంద్రం కరుణించి నిధులు మంజూరయ్యేనా..?





కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కీలకమైన పనుల కోసం కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలను అందజేస్తున్నారు. ఎన్నికల్లో కేసీఆర్, రేవంత్‌రెడ్డిలను ఓడించి గెలిచిన ఆయన నియోజకవర్గంలో పలు పనులు చేపట్టాలని తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే కేంద్రం ఆయన ప్రతిపాదనలకు ఓకే చెప్పి, నిధులు మంజూరు చేస్తుందా లేదా చూడాలి.

– అక్షరటుడే, కామారెడ్డి

ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు..

కామారెడ్డి నియోజకవర్గంలో కీలకమైన పనులకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి కేంద్ర మంత్రులకు ప్రతిపాదనలు సమర్పించారు. ఇప్పటికే పనుల ఆమోదం కోసం ఒకటికి పది సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగి కేంద్ర మంత్రులను కలిసి పలు దఫాలుగా వినతిపత్రాలు అంద జేశారు. అయినప్పటికీ కేంద్రం నుంచి ఆశించిన ఫలితాలు లభించడం లేదన్న టాక్ వినిపిస్తోంది.

బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కాటిపల్లి వెంకట రమణారెడ్డి రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం, ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యే ఉండటంతో అభివృద్ధి కొరవడింది. దాంతో కేంద్రం నుంచి నిధులు తేవడం కోసం ఎమ్మెల్యే ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రతిపాదనలు ఇవే..

కామారెడ్డి పట్టణంలో 2 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఒక ఆర్ఓబీ నిర్మాణం చేపట్టాలని కోరారు. పట్టణం చుట్టూ 54 కిలోమీటర్ల మేర రూ.510 కోట్ల వ్యయంతో రింగ్ రోడ్డు, అలాగే సీఆర్ఎఫ్ నిధుల ద్వారా లింగాపూర్‌మెడికల్ కళాశాలమైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల మీదుగా పాత జాతీయ రహదారి వరకు రూ.40 కోట్లతో మరో రింగ్ రోడ్డు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రోడ్ల విస్తరణలో భాగంగా రూ.50 కోట్లతో 20.8 కిలోమీటర్ల రహదారులను డబుల్ రోడ్డుగా మార్చే ప్రతిపాదన ఇచ్చారు. ఇందులో భిక్కనూర్-రాజంపేట్ రోడ్డు (తిప్పాపూర్, తలమడ్ల మీదుగా) 6.4 కి.మీకి రూ.18 కోట్లు, కామారెడ్డి పాత బస్టాండ్‌రంగంపేట రైల్వే గేట్ రోడ్డు 2.8 కి.మీకి రూ.8 కోట్లు, పాల్వంచమర్రి-భిక్కనూర్ వయా మంధాపూర్ రోడ్డు 11.6 కి.మీకి రూ.24 కోట్ల అంచనాలు ఉన్నాయి. స్పోర్ట్స్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు, రూ.27 కోట్లతో ఇండోర్ స్టేడియం అప్‌గ్రేడేషన్, కామారెడ్డికి స్మార్ట్ సిటీ హోదా, ఇండస్ట్రియల్ కారిడార్, ఫ్లయింగ్ అకాడమీ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రులను ఎమ్మెల్యే కోరారు.

ఆమోదం కోసం ప్రయత్నాలు..

పైన ప్రతిపాదించిన పనుల్లో కీలకమైన పనుల మంజూరు కోసం ఎమ్మెల్యే కేవీఆర్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వీలు కుదిరినప్పుడల్లా ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రుల అపాయింట్ మెంట్ తీసుకుని పదేపదే వినతిపత్రాలు అందిస్తున్నారు. కీలకమైన పనులకు నిధులు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకున్నా కేంద్రం నుంచి నిధులు తెచ్చి నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని ప్రజల్లో చెప్పుకునే అవకాశం ఉంటుంది. ఎమ్మెల్యే ప్రయత్నాలకు మాత్రం విరామం ఇవ్వడం లేదు. పనుల మంజూరు కోసం తనవంతు కృషి చేస్తూనే ఉన్నారు. అయితే కేంద్రం నుంచి సానుకూల స్పందన మాత్రం రావడం లేదు. ఇటీవల ఆర్వోబీ మాత్రం మంజూరైనట్టుగా తెలుస్తోంది. కేంద్రం కరుణించి నిధులు మంజూరు చేస్తే కామారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేవీఆర్ హయాంలో శాశ్వత పనులకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంటుంది. మరి కేంద్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

అభివృద్ధికి ప్రతిపాదనలు

కామారెడ్డి జిల్లాలో అత్యంత క్లిష్టమైన సమయంలో ఉద్దండుల పోటీ మధ్య బీజేపీ నుంచి కేవీఆర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజకవర్గ ప్రజలు సైతం మార్పు కోరుకోవడంతో తాజా మాజీ సీఎంలపై కేవీఆర్ గెలుపొందారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గంలో శాశ్వత పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సుమారు రూ.వెయ్యి కోట్లకు పైగా పనుల మంజూరు కోసం వినతిపత్రాలు సమర్పించారు.

ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్ట్ చేయాలి

అక్షరటుడే, కామారెడ్డి: ఎన్నికల ప్రక్రియను నిర్వీర్యం చేస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను దేశద్రోహిగా ప్రకటించి అరెస్ట్ చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు డిమాండ్ చేశారు. కామారెడ్డి కలెక్టరేట్ వద్ద ఓటు చోరీపై సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ముందుగా కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావు మాట్లాడుతూ.. ఓటు చోరీ అంశాన్ని వెలుగులోకి తెచ్చిన రాహుల్ గాంధీ వెంట దేశం మొత్తం నిలబడుతోందన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఒంటెద్దు పోకడలు పోతున్నారని విమర్శించారు. కుటిల నీతితో ఓట్లను తొలగించి ఫారం 6ను ఏకపక్షంగా తయారు చేసి యువకులను ఓటు హక్కులో పాల్గొనకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మ అని పేర్కొన్నారు. ఓటు



చోరీపై పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తమ నియోజకవర్గాల్లో విదేశీయులు ఎవరున్నారో ఎంపీ అర్వింద్ చూపించాలని, అసంబద్ధమైన మాటలు మాట్లాడటం తప్పని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, గ్రంథాలయ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇలియాస్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి డీఎల్‌పీవోకు ఘనసన్మానం

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్‌ను సోమవారం ఆర్డీవో ప్రభాకర్ ఘనంగా సన్మానించారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ డీఎల్పీవో సురేందర్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం జ్ఞాపికతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, డివిజన్ స్థాయి అధికారులు, వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.



బీసీ బాలబాలికల వసతిగృహానికి భవనాలను నిర్మించాలి

అక్షరటుడే, ఆర్మూర్: శిథిలావస్థలో ఉన్న వసతి గృహాలకు నూతన భవనాలు నిర్మించాలని పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్, ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు డి.నిఖిల్ మాట్లాడుతూ.. పట్టణంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరిందన్నారు. కమ్మర్‌పల్లి మండల్ చౌట్‌పల్లిలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహం ప్రస్తుతం శిథిలావస్థలో ఉందని, దాదాపు 100 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారన్నారు. విద్యార్థులు నివసిస్తున్న వసతిగృహ భవనం పాతబడిపోయి, అనేక సమస్యలతో ఇబ్బందికరంగా మారిందని వారు పేర్కొన్నారు. వెంటన భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా ప్రధాన కార్యదర్శి రాజు, ఏరియా నాయకులు వెంకట్, ప్రణయ్, అజయ్, గోపాల్, గిరీష్, ఆనంద్, సాయి, తేజ, నిఖిల్ పాల్గొన్నారు.



గిరిజనుల భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

అక్షర టుడే, కామారెడ్డి: హాజీపూర్ తండా భూములకు పట్టా హక్కు పత్రాలు ఇవ్వాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోతీరాం నాయక్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ తండాలో 70 కుటుంబాలు గత 60 ఏళ్లుగా సర్వే నంబర్ 66లో 40 ఎకరాలు, 176లో 13 ఎకరాలు, 177లో 40 ఎకరాలు పోడు భూమిని సాగు చేసుకుంటున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు ఒక్క గుంట భూమికి కూడా పట్టా ఇవ్వలేదని, అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రెండు విడతలుగా పోడు భూములకు పట్టాలు ఇచ్చినా హాజీపూర్ తండా వాసులకు ఒక్క సెంటు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ అధికారులు రోజూ తండాలో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, కేసులు పెడతామని, జైలుకు పంపుతామని బెదిరిస్తూ పది మంది పేర్లు ఇవ్వాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. 2005 చట్టం ప్రకారం రెవెన్యూ, అటవీ భూమి అయినా సరే సర్వే చేసి హక్కుపత్రాలు ఇవ్వాలని, గిరిజనులను ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు.



లక్కీడ్రా ద్వారా 'డబుల్ బెడ్‌రూం' ఇళ్ల కేటాయింపు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలోని నార్త్ మండలం పరిధిలోని కలెక్టరేట్ సమీపంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులను సోమవారం అధికారులు చేపట్టారు. మున్సిపల్ సిటిజన్ సర్వీస్ సెంటర్ భవనంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య లక్కీ డ్రా నిర్వహించారు. మేయర్ కూరగాయల ఉమారాణి, ఆర్డీవో రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ పర్యవేక్షణలో ఈ లాటరీ ప్రక్రియ జరిగింది. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ అర్హత కలిగిన వారి పేర్లను అందరి సమక్షంలో డ్రా తీస్తూ లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించారు. ఎలాంటి పొరపాట్లు, అనుమానాలకు తావు లేకుండా వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, అర్హులుగా ఖరారైన దరఖాస్తుదారుల సమక్షంలో, వీడియోగ్రఫీ చిత్రీకరణ మధ్యపూర్తి చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఎస్టీలకు 6 శాతం, ఎస్సీలకు 17శాతం, మైనారిటీలకు 12శాతం, దివ్యాంగులకు 5శాతం చొప్పున రిజర్వేషన్లను అమలు చేసి లబ్ధిదారులను డ్రా ద్వారా ఎంపిక చేస్తూ పేర్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ బి.చంద్రశేఖర్, హౌసింగ్ ఈఈ జె.రాజ్యలక్ష్మి, నార్త్ తహశీల్దార్ హరికిశోర్ పాల్గొన్నారు.



సానిటేషన్ పనులపై మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆగ్రహం

అక్షరటుడే, కామారెడ్డి: పట్టణంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి సోమవారం ఆకస్మిక పర్యటన చేపట్టారు. పట్టణంలోని 20, 22, 23, 24 వార్డుల్లో పారిశుధ్యం, సానిటేషన్ పనులు, విద్యుత్ స్తంభాల పరిస్థితిని ఆమె స్వయంగా పరిశీలించారు. పర్యటనలో భాగంగా పలు వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటం, డ్రైనేజీలు పూడుకుపోయి, పొదలతో మురుగునీరు నిలిచిపోవడాన్ని గమనించారు. వార్డుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని స్థానికులు ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. సానిటేషన్ సిబ్బంది సక్రమంగా చేపట్టకపోవడం, చెత్త సేకరణ ఆలస్యం కావడంపై ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలే వర్షాకాలంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సానిటేషన్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతిరోజూ చెత్త సేకరణ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేయాలని, కొత్త పోల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పర్వతాలు, కౌన్సిలర్స్, డీఈ హన్మాంతరావు, ఏఈ వేణు ప్రసాద్, టీపీవో దేవరాజు, టీపీబీవో మల్లికార్జున్ పాల్గొన్నారు.



భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



అక్షరటుడే, భీమ్‌గల్: దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన భగత్ సింగ్ ఆశయాలను నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహ్మాన్ అన్నారు. భీమ్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం భగత్ సింగ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సయ్యద్ రెహ్మాన్ మాట్లాడుతూ.. భగత్ సింగ్ ధైర్యం, దేశభక్తి, నిస్వార్థ త్యాగం తరతరాల యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్య, విజ్ఞానం, క్రీడలు, సామాజిక సేవపై దృష్టి సారించాలని సూచించారు. దురలవాట్ల వల్ల ఆరోగ్యం, విద్య, కుటుంబ జీవితంతో పాటు భవిష్యత్తు నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందన్న ఆయన, సమాజంలో మంచి మార్పు తెచ్చేందుకు యువత ముందుకు రావాలన్నారు.

బీర్కూర్ మండల కేంద్రంలో..



అక్షరటుడే బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలోని భగత్‌సింగ్ చౌరస్తాలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరిగే ధర్మతేజ, పీడీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. బాల్‌రాజ్ మాట్లాడుతూ.. చిన్న వయస్సు నుంచే దేశానికి స్వాతంత్ర్యం రావాలని ఆకాంక్షించిన భగత్‌సింగ్, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన మహోన్నత స్వాతంత్ర్య సమరయోధుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, వడ్ల చంద్రకాంత్, బాలకృష్ణ, వడ్ల బస్వరాజు, చామకుర రాజు, నారం శేఖర్, నరేష్, షేక్ సమీర్, కుర్రి కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులు గళమెత్తారు.. ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న పింఛన్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారు సోమవారం పీఎఫ్ కార్యాలయాన్ని ముట్టడించారు. వేలాదిగా తరలివచ్చిన కార్మికులు కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. – అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్



కదం తొక్కిన బీడీకార్మికులు..

- పీఎఫ్ కార్యాలయం ముట్టడి
- బీడీ పింఛన్ పెంచాలని డిమాండ్..
- ఆధార్ ప్రకారం తప్పలను సవరించాలని విన్నపం

రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత కుటీర పరిశ్రమగా పిలువబడే ఏకైక పరిశ్రమ బీడీపరిశ్రమ అని తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ పేర్కొన్నారు. అలాంటి వ్యవస్థలో కార్మికుల అవస్థలు ఇన్నీఅన్నీ కావన్నారు. దాదాపుగా ఏడున్నర లక్షల మంది బీడీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్నారని వివరించారు. అయితే బీడీ కంపెనీల్లో చేసిన చిన్నచిన్న తప్పుల కారణంగా వేలాది మంది కార్మికులు ఈపీఎఫ్ పెన్షన్‌కు అనర్హులుగా మిగిలిపోయారన్నారు. ఈపీఎఫ్ డబ్బులు డ్రా చేసుకునేందుకు ఫారం నం.19లో దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నప్పటికీ ఆధార్‌లో సమస్యల కారణంగా డబ్బులు డ్రా చేసుకోలేక కార్మికులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు.

నిరక్షరాస్యులైన కార్మికులతో చెలగాటం

2013లో వచ్చిన ఆధార్ కార్డులతో కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారని రాజేశ్వర్ పేర్కొన్నారు. పీఎఫ్‌కు ఆధార్ ప్రధానమని తెలియక చాలామంది మహిళలు తమ ఇష్టం ఉన్నట్లుగా ఆధార్ కార్డులు చేయించుకున్నారు. ఇందులో బీడీ కమిషన్ ఏజెంట్ల తప్పులు కూడా చాలా ఉన్నాయన్నారు. పీఎఫ్‌లో ఒకలాగా.. బీడీ కంపెనీలో ఒకలాగా..ఆధార్‌లో ఒకలాగా పేర్లు నమోదు కావడంతో కార్మికులు పీఎఫ్‌కు నోచుకోవట్లేదని.. ఈపీఎఫ్ విత్‌డ్రా కావట్లేదని వాపోతున్నారన్నారు. బీడీ కార్మికులు భారీ ఎత్తున ధర్నాలు చేస్తే కొన్నేళ్ల క్రితం పింఛన్‌ను రూ.3వేలకు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికీ దాని ఊసే ఎత్తట్లేదన్నారు.



హాజరుశాతం ప్రాతిపాదకన అన్యాయం..

గతంలో పదేళ్లు ఒకచోట పని చేస్తే బీడీ పెన్షన్ వచ్చేదని.. కాని కేంద్ర ప్రభుత్వం హాజరుశాతం ప్రాతిపాదికన పెన్షన్ అమలు చేస్తామని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఈరోజుల్లో బీడీ పరిశ్రమ నెలకు 5 నుంచి 10 రోజులు మాత్రమే పని చేస్తోందని.. ఈ లెక్కన కార్మికులు బీడీ పింఛన్‌కు అర్హుల కాలేరన్నారు. ఇటీవల తీసుకొచ్చిన పీఎఫ్‌లో మార్పులు బీడీ కార్మికులకు నష్టం జరిగే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు రాజీనామా చేస్తే 50శాతం డబ్బులు ఏడాది తర్వాత ఇస్తామనడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. ఈ ముట్టడిలో నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా కమిటీ ఉపాధ్యక్షురాలు సత్తెవ్వ, రాజేశ్వర్, ప్రకాష్, కోశాధికారి అర్వింద్, నాయకులు ఎస్ కిషోర్, ఎండీ నజీర్, ఎస్‌కే సాధుల్లా కార్మికులు మటంల రాజవ్వ, కౌసల్య, సువర్ణ, గౌండ్ల, పద్మ, పుష్ప, విజయ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



అక్షరటుడే, ముప్కాల్: మండల కేంద్రానికి చెందిన నేర భూమేశ్వర్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పద్మ-కిషన్ దంపతుల కుమారుడు సంతోష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతుడి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కట్ట మహేష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పెంటు గంగాధర్, శ్రీకాంత్ యాదవ్, సంజీవ్ థామస్, కట్ట గోపి, ఓజా ప్రకాష్, ముక్కపల్లి గోపి, ఓజా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఐడీ కార్డ్స్ అందజేత..

అక్షరటుడే, నందిపేట్: వెల్మల్ గ్రామానికి చెందిన బైన రవి తన పుట్టిన రోజు సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఐడీ కార్డ్స్ అందజేశారు. విద్యార్థులతో కలిసి పుట్టిన రోజు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని బైనరవి తెలిపారు. ప్రైవేట్ పాఠశాలకు పోటీగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలని ఉద్దేశ్యంతో ఐడీ కార్డ్స్ అందజేస్తునట్లు తెలిపారు.. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సంతోష్, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు షేక్ అబ్దుల్, ఉపాధ్యాయులు లంక రఘువీర్, కవి గాయకులు వెల్మల్ శ్రవణ్, వార్డ్ సభ్యులు నవీన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన



అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాల కళాశాలలో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాల గురించి సోమవారం విద్యార్థులకు ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ అవగాహన కల్పించారు. మత్తుకు దూరం కావడం అనేది పూర్తిగా మానసిక పరిపూర్ణతతోనే సాధ్యమవుతుందని గోవింద్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి మానస వివరించారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ గంగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోచారం ప్రాజెక్టును పరిశీలించిన అధికారులు



అక్షరటుడే, ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని పోచారం ప్రాజెక్టును ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈ ఎల్లారెడ్డితో పాటు ఫీల్డ్ సిబ్బంది పరిశీలించారు. డీఆర్ఐపీ పథకం కింద ప్రాజెక్టులో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. ప్రాజెక్టు పరిధిలోని వంతెన పునర్నిర్మాణం, లైటింగ్ ఏర్పాట్లు, ప్యారపెట్ వాల్ నిర్మాణం, ఎర్తన్ బండ్‌పై రైలింగ్ ఏర్పాటు తదితర పనులను పరిశీలించారు. ప్రాజెక్టు భద్రత, సందర్శకుల సౌకర్యం, మౌలిక వసతుల మెరుగుదలకు అవసరమైన పనులను డీఆర్ఐపీ పథకంలో చేర్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, సంబంధిత ప్రతిపాదనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫీల్డ్ సిబ్బంది ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారులకు వివరించారు.

బాధిత కుటుంబానికి జీవన్ రెడ్డి పరామర్శ



అక్షరటుడే, మాక్లూర్: చిన్నాపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ రమేష్ కుటుంబాన్ని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సోమవారం పరామర్శించారు. రమేష్ కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జీవన్ రెడ్డి బాధిత కుటుంబం ఇంటికి వెళ్లారు. రమేష్‌కు మనోధైర్యం కల్పించారు. భవిష్యత్తులో అన్నివిధాతా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంజిత్, నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి..



అక్షరటుడే, నందిపేట్: యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనాన్ని అలవర్చుకోవాలని మండల వైద్యాధికారి ప్రవీణ్ రెడ్డి పేర్కొన్నారు. జడ్పీహెచ్ఎస్ ,ఐలాపూర్ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాలు ,గుట్కా, పొగాకు, మద్యంతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం కుటుంబాలపై విద్యపై, వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలు, విద్య, ఉపాధి, సృజనాత్మక కార్యక్రమాల వైపు దృష్టి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వాతి, పీహెచ్ఎన్ పద్మావతి, హెచ్ఈవో భాస్కర్ పాల్గొన్నారు.

మొక్కజొన్న, సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



అక్షరటుడే, ఆర్మూర్ : మొక్కజొన్న, సోయా పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి దేవరాం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేముందు పండిన ప్రతిగింజ కొనుగోలు చేస్తామని, పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి ఎంఎస్పీని అన్నిపంటలకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐయూకేఎస్ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు కిషన్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజన్న, జిల్లా కార్యదర్శి ఆకుల గంగారాం, గంగాధర్, హోసన్న, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో వికసిత్ ప్రణాళికలు సిద్ధం చేయాలి



అక్షరటుడే, భీమ్‌గల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రతి గ్రామంలో వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికను పక్కాగా సిద్ధం చేయాలని భీమ్‌గల్ ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ తెలిపారు. మండలంలోని బెజ్జోరా గ్రామంలో వికసిత్ గ్రామపంచాయతీ ప్లాన్ తయారీలో భాగంగా సోమవారం మహిళలు, రైతులు, గ్రామస్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ మ్యాపింగ్, రిసోర్స్ మ్యాపింగ్ ప్రక్రియ ద్వారా గ్రామానికి అవసరమైన సుమారు 375 రకాల అభివృద్ధి పనులను గుర్తించే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. అక్టోబర్ 2న నిర్వహించే గాంధీ జయంతి గ్రామసభలో గ్రామాభివృద్ధికి కావాల్సిన ఉపాధి హామీ కూలీల పనులు, మౌలిక సదుపాయాల కల్పన పనులను గుర్తించిఆమోదం తెలపాలని కోరారు. సర్పంచ్ కార్తీక్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రవీణ్ పాల్గొన్నారు.



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఫస్టియర్ విద్యార్థులను ఆహ్వానిస్తూ సెకండియర్, థర్డ్ ఇయర్ విద్యార్థులు ఫ్రెషర్స్ పార్టీని ఏర్పాటు చేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహుతులను అలరించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలని.. తద్వారా దేశానికి పేరు తెచ్చేవిధంగా తయారు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కేర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోరంట్ల నరేష్, వైస్ ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, కళాశాల బాధ్యులు కొయ్యాడ శంకర్, సందేశ్, కిరణ్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చేతబడి కలకలం..



అక్షరటుడే గాంధారి: మండలంలోని నాగులూర్ తండా లోని ప్రైమరీ పాఠశాలలో చేతబడి చేసినట్లుగా ఆనవాళ్లు కనిపించాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఉదయం పూట స్కూలుకు వచ్చిన విద్యార్థులకు కొబ్బరికాయలు పసుపు, కుంకుమ, మేక ఎముకలు కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. వెంటనే తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించారు. దీంతో విద్యార్థులను స్కూలుకు పంపించేందుకు తల్లిదండ్రులు సైతం జంకుతున్నారు. గ్రామంలో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాలని తీర్మానం చేసుకోవాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నారు.